క్లుప్తంగా

కళాశాలకు పీజీటీ పోస్టుల మంజూరు



బట్టేలంకలో అడ్మిషన్ల క్యాంపు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులతో హెచ్ఎం సుబ్బలక్ష్మి

మలికిపురం: మండలంలోని బట్టేలంకలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఐదు పీజీటీ పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు ప్రధానోపాధ్యాయిని కేవీఆర్ సుబ్బలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె తోటి ఉపాధ్యాయులతో కలసి చుట్టుపక్కల గ్రామాల్లో అడ్మిషన్ క్యాంపు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం బాలికా విద్యను ప్రోత్సహించేందుకు మండలానికి అదనపు కళాశాలను మంజూరు చేసిందన్నారు. ఇందులో బోధనలకు అదనపు అధ్యాపకులను నియమించినట్లు ఆమె వివరించారు. తెలుగు, ఇంగ్లీషు, కెమిస్ట్రీ, మ్యాథ్స్ సబ్జెక్టుల బోధనకు మెరుగైన చర్యలు తీసుకున్నట్లు ఆమె చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అడ్మిషన్లకు బట్టేలంక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని ఆమె సూచించారు.

లోవోల్టేజీ సమస్యను పరిష్కరించండి

అంబాజీపేట: గ్రామంలో ఉన్న లో వోల్టేజీతో పాటు ఇతర విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ ముక్కామల గ్రామస్తులు అంబాజీపేట విద్యుత్ శాఖ అధికారులను కోరారు. లోవోల్టేజీ సమస్య వల్ల విద్యుత్ సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. ఇటీవల రెండు రోజులుగా వీచిన ఈదురుగాలులకు గృహోపకరణాలు కాలిపోయాయన్నారు. బుద్ధానగర్ ఏరియాలో విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగిపోవడంతో వైర్లు కిందకు వేలాడుతున్నాయని, కొన్ని ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ ఏఈ ఎ.హరిబాబుకు వినతిపత్రం అందించారు. దీనిపై ఏఈ స్పందించి త్వరలో విద్యుత్ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: ప్రభుత్వం బ్యాంకుల నుంచి అందిస్తున్న రుణాలను కౌలు రైతులకు సద్వినియోగం చేసుకోవాలని ఏవో సీహెచ్‌డీ విజయ్ కుమార్ అన్నారు. గంగలకుర్రులో మండల వ్యవసాయ శాఖ, డీసీసీబీ బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో కౌలు రైతులకు అవగాహన సదస్సును సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఏవో మాట్లాడుతూ కౌలు పైలట్ ప్రాజెక్టుగా గంగలకుర్రులోని రైతులకు రుణాలు అందించనున్నామన్నారు. కౌలు రైతులు ఆర్థిక పురోభివృద్ధి చెందడానికి రుణాలు అందిస్తున్నామన్నారు. రుణం పొందిన కౌలు రైతులు తిరిగి 11 నెలల్లో చెల్లించాలన్నారు. ఒక గ్రామాన్ని ఒక యూనిట్‌గా పరిగణించి కౌలు రైతులను ఏఏఓలు, వీహెచ్ఓల ద్వారా గుర్తించి రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ సదస్సులో తహసీల్దార్ టి.మంగతాయారు, బ్యాంక్ సూపర్‌వైజర్ ఎ.రవితేజ, ఏఈఓ డి.దుర్గారావు, వీఆర్వో వి.నాగేశ్వరరావు, వీహెచ్ఏ ఎం.ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా రావులమ్మ తీర్థం

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలో వేంచేసిన రావులమ్మ అమ్మవారి తీర్థాన్ని మంగళవారం వైభవంగా జరిపారు. అమ్మవారికి గ్రామ ఆడపడుచులు చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, రాయుడు షణ్ముఖ్, ఎంఎం శెట్టి, విత్తనాల శేఖర్, మట్టపర్తి యజ్ఞశ్రీ తదితరులు దర్శించుకున్న వారిలో ఉన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ, గోగులమ్మల జాతర

పి.గన్నవరం: మండలంలోని నాగుల్లంకలో వేంచేసిన ముత్యాలమ్మ, గోగులమ్మ వార్ల జాతర మహోత్సవాలు మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. వందలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలకు ఆయా ఆలయ కమిటీల నాయకులు ఆధ్వర్యం వహించారు.

నిత్యాన్నదానానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన కె.లోకేష్-అపర్ణా దేవి దంపతులు రూ.15,999 విరాళం అందించినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందించారు.

చదవడం అంటే మాకిష్టం

రావులపాలెం: మండలంలోని రావులపాడు వంతెన పక్కన గుడారాల్లో నివాసముంటున్న వలస కూలీలు పిల్లలకు ర్యాలికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు చింతా శ్యామ్‌కుమార్ నిర్వహిస్తున్న సంచార గ్రంథాలయంతో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న చదవడం అంటే మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారులకు చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చి పోటీలను నిర్వహించారు. అలాగే వారికి బహుమతులు అందజేశారు. అనంతరం చిన్నారులకు కథలు, దేశనాయకుల జీవిత విశేషాలు శ్యామ్ వివరించారు.

పశు బీమా.. రైతులకు ధీమా

- మూడేళ్ల ప్రీమియంలో 80 శాతం రాయితీ
- లబ్ధిదారుల వాటా 20 శాతం
- జూన్ 1 నుంచి పథకం అమలు



దేశీయ, సంకర జాతి ఆవులు

కొత్తపేట: విపత్తులు, రోడ్డు ప్రమాదాలు, విద్యుదాఘాతాలతో వేలాది మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వాటిని కన్నబిడ్డల్లా సాకే యజమానుల బాధ వర్ణనాతీతం. తమ కుటుంబ పోషణకు వాటిపైనే ఆధారపడి జీవిస్తున్న వారు ఆ జీవాలు మరణిస్తే తల్లడిల్లిపోతారు. ఈ నేపథ్యంలో వివిధ ఘటనల్లో జీవాలు కోల్పోతున్న రైతులను ఆదుకోవాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంకల్పించింది. దానిలో భాగంగా వైఎస్సార్ పశుబీమా పథకం (పశు నష్ట పరిహార పథకం) ద్వారా వారికి అండగా నిలవనుంది. ఆ మేరకు పశు సంవర్థక శాఖ ద్వారా ప్రతిపాదనలు రూపొందించింది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి శ్రీకారం చుట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. పశువులు, మేకలు, గొర్రెలు లాంటి సన్న జీవాలకూ బీమా వర్తింపచేయనుంది.

బీమా ఇలా..

వైఎస్సార్ పశు బీమా పథకం కింద దేశవాళీ, సంకర జాతి పశువులకు రూ.30 వేలు వరకూ, నాటు జాతికి చెందిన ఆడ, మగ పశువులకు రూ.15 వేలు వరకూ, గొర్రెలు/మేకలు, పందులకు రూ.6 వేలు వరకూ ప్రభుత్వం బీమా సౌకర్యం కలగచేస్తుంది. లబ్ధిదారులు ప్రభుత్వ నిర్ణీత బీమా మొత్తం కన్నా ఎక్కువ మొత్తానికి చేయించుకోదలిస్తే ఆపై మొత్తానికి పూర్తి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఆవులు/గేదెలలో గరిష్ఠంగా రూ.1.20 లక్షలు, గొర్రెలు/మేకలు, పందులలో గరిష్ఠంగా రూ.15 వేలు వరకూ బీమా సదుపాయం ఉంది. ఒకవేళ లబ్ధిదారు పశువును వేరే రైతులు విక్రయించినా ఆ వివరాలు వారం రోజుల్లోగా తెలియజేస్తే పాలసీని కొత్త యజమానికి వర్తింపచేస్తారు. బీమా పరిహారానికి ట్యాగ్ తప్పనిసరి.

ప్రీమియంలో లబ్ధిదారుల వాటా 20 శాతమే..

ఈ బీమాకు సంబంధించి ప్రీమియంలో లబ్ధిదారుల వాటా కింద తెల్లరేషన్ కార్డు ఉన్న రైతులు 20 శాతం, తెల్లరేషన్ కార్డు లేని రైతులు 50 శాతం ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. 80 శాతం ప్రభుత్వం భరిస్తుంది. దేశీయ సంకర జాతి ఆవులు, గేదెలకు మూడేళ్లకు ఒక్కోదానికి తెల్లరేషన్ కార్డు లేని రైతులు రూ.960, ఎస్సీ, ఎస్టీ రైతులు రూ.384 చొప్పున చెల్లించాలి. నాటు జాతికి చెందిన పశువులకు తెల్లరేషన్ కార్డు లేని రైతులు రూ.480, తెల్లరేషన్ కార్డు ఉన్న రైతులు, ఎస్సీ, ఎస్టీ రైతులు రూ.192 చొప్పున చెల్లించాలి. మేకలు, గొర్రెలు, పందులకు తెల్లరేషన్ కార్డు లేని వారు ఏడాదికి రూ.90, తెల్లకార్డు ఉన్న వారు, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు రూ.36 చెల్లించాల్సి ఉంటుంది. రెండేళ్లకు అయితే రూ.135, రూ.54, మూడేళ్లకు అయితే రూ.187.50, రూ.75 చొప్పున చెల్లించాలి. పశువులకు మూడేళ్ల పాటు, మేకలు/గొర్రెలు, పందులకు 1, 2 లేదా మూడేళ్ల పాటు బీమా పథకం వర్తిస్తుంది. పశువు లేదా జీవాలు మరణించిన 21 రోజుల్లోపే పరిహారం లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాకు జమ అవుతుంది.

పశువులు, జీవాల రైతుల ప్రయోజనమే లక్ష్యంగా..



పాడి పశువులు, జీవాల రైతుల ప్రయోజనమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పశుసంవర్థక శాఖ ఈ వైఎస్సార్ పశు బీమా పథకం (పశు నష్ట పరిహార పథకం) రూపకల్పన చేసింది. రాష్ట్రంలోని ప్రతి పాడి పశువుతో పాటు మూగ జీవాలైన మేకలు, గొర్రెలు, పందులకు కూడా బీమా కలిపించాలని సంకల్పించారు. ఇందు కోసం ప్రభుత్వం 80 శాతం ప్రీమియం భరిస్తోంది. జూన్ 1 నుంచి ఈ పథకం అమలు కానుంది.

– సీహెచ్ వెంకటనారాయణ, ఏడీ, పశుసంవర్థక శాఖ, కొత్తపేట

సామాజిక న్యాయంతో సర్వతోముఖాభివృద్ధి

రూ.16.90 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి



అంబాజీపేటలో ఎమ్మెల్యేకు కేకు తినిపిస్తున్న అభిమానులు



రాజోలులో రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాపాక

అంబాజీపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు సామాజిక న్యాయం సర్వతో ముఖాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అంబాజీపేట మార్కెట్ యార్డులో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు అధ్యక్షతన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కేకు కట్ చేసి కార్యకర్తలకు పంచారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా సీఎం జగన్ పాలనలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారన్నారు. పాఠశాలలు, ఆస్పత్రులను 'నాడు-నేడు' ద్వారా ఎంతో అభివృద్ధి చేశారన్నారు. నవరత్నాలు ద్వారా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చారన్నారు. నియోజకవర్గంలో రూ.1,690 కోట్లతో అభివృద్ధి సాధించామన్నారు. దీనిలో భాగంగా రూ.130 కోట్లతో రోడ్లు, రూ.100 కోట్లుతో జలజీవన్ మిషన్ పనులు చేపట్టామన్నారు. లంక ప్రాంత వాసుల రహదారుల సౌకర్యానికి రూ.60 కోట్లతో ఊడిమూడిలంక వద్ద వంతెన నిర్మాణాన్ని చేపట్టామన్నారు. సీఎం సహాయ నిధి కింద రూ.25 కోట్ల సాయం అందించామన్నారు. 10 వేల మందికి ఇళ్ల పట్టాలు, మెడికల్ కాలేజ్, తదితర పనులు చేపట్టామన్నారు. లంక గ్రామ ప్రజలకు 1400 ఎకరాల్లో ఇళ్ల పట్టాలు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. వివిధ రకాల సంక్షేమ పథకాలతో లక్షలాది మందికి కోట్లాది రూపాయలు లబ్ధి చేకూర్చామని గడపగడపకూ వెళ్లినప్పుడు ప్రతి ఒక్క కుటుంబానికి వివరించామన్నారు. సమావేశంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీలు బూడిద వరలక్ష్మి, గన్నవరపు శ్రీనివాసరావు, పీకే రావు, నక్కా వెంకటేశ్వరరావు, పేరి శ్రీనివాస్, దొమ్మేటి సత్యమోహన్, వేటుకూరి సూర్యనారాయణరాజు, నాగవరపు నాగరాజు, నేతల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనకు నాలుగేళ్లు పూర్తి

రాజోలు: సీఎం జగన్ నేతృత్వంలో రాష్ట్రంలో సుపరిపాలనకు నాలుగేళ్లు దిగ్విజయంగా పూర్తయిందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం రాజోలు మార్కెట్ సెంటర్‌లో దివంగత మాజీ సీఎం వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే రాపాక పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. రాజోలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఓఆర్ఎస్ డ్రింక్స్ పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో దేశంలోనే రాష్ట్రాన్ని ముందు వరుసలో ఉంచిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. మరోసారి సీఎంగా జగన్‌ని విజయపథం వైపు నడిపించేందుకు అన్ని వర్గాలకు చెందిన ప్రజలు సంసిద్ధంగా ఉన్నారన్నారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, సర్పంచ్ రేవు జ్యోతి, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్య, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, దార్ల పెదబాబు, మంచికంటి బోస్, సఖినేటిపల్లి మండల ఉపాధ్యక్షుడు రుద్రరాజు చిన్నరాజా తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లతో గ్రామ వికాసం



తూర్పుపాలెంలో సన్మానం అందుకున్న వలంటీర్లతో బ్రహ్మాజీ తదితరులు



సోంపల్లిలో వలంటీర్‌ను సత్కరిస్తున్న జెడ్పీటీసీ శైలజ

మలికిపురం: ప్రభుత్వం నియమించిన వలంటీర్ వ్యవస్థ ద్వారా గ్రామ వికాసం చెందుతున్నట్లు డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల వీర బ్రహ్మాజీరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తూర్పుపాలెం, కేశనపల్లిల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్ల ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుర్లింక మురళీ వెంకట సత్యనారాయణ, ఎంపీటీసీ ఒగ్గు వెంకట సుబ్బారావు, కార్యదర్శి ఎస్‌డీఎస్ ప్రసాద్, చింతా రాజబాబు, నల్లి శివ కుమార్, తాడిచర్ల కేశవరావు, నల్లి సత్యం, ఆనందం రాంబాబు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వలంటీర్ల వ్యవస్థ సుపరిపాలనకు చిరునామాగా నిలిచిందని జెడ్పీటీసీ, రాష్ట్ర పరిశ్రమల మౌలిక సదుపాయాల సంస్థ డైరెక్టర్ మట్టా శైలజ అన్నారు. మంగళవారం సోంపల్లి గ్రామసచివాలయం వద్ద సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. వలంటీర్లు అందిస్తున్న సేవలకు ప్రభుత్వం గుర్తించి వారికి సత్కారాలు చేయడం ఎంతో అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఎంపీడీఓ ఎస్.బాలాజీ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బొమ్మిడి వెంకటేష్, తిరుమాని రాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో జవాబుదారీతనానికే ప్రాధాన్యం



గంగలకుర్రులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా అందించడంతో పాటు, పాలనలో జవాబుదారీ తనానికి జగనన్న ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గంగలకుర్రులో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు అధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎమెల్యే చిట్టిబాబు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిట్టిబాబు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లతో సీఎం జగన్ మెరుగైన పాలన అందిస్తున్నారన్నారు. గతంలో ఏ పథకం కావాలన్నా జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు తలుపుతట్టి మరీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. నాలుగేళ్లలో ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరించే బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, దొమ్మేటి నాగన్న, మైలా ఆనందరావు, విత్తనాల శేఖర్, పితాని కాశీ, బొక్కా వీవీ సత్యనారాయణ, మట్టపర్తి యజ్ఞశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన డీఎల్‌పీఓ

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెం గ్రామ సచివాలయాన్ని డీఎల్‌పీఓ పి.విజయథామస్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో ఆధార్ సెంటర్‌ను పరిశీలించారు. అప్పుడే పుట్టిన పిల్లల దగ్గర నుంచి ఐదు సంవత్సరాల్లోపు పిల్లల వరకూ ఆధార్ నమోదు ప్రక్రియ తప్పని సరన్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకూ స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సర్వీసు చార్జీలు చెల్లించి ప్రజలు వివిధ సేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గరిమెళ్ల రవి తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



రాజోలు ఆస్పత్రి ఆవరణలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

రాజోలు: సామాజిక ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు వైద్యులకు సూచించారు. మంగళవారం రాజోలు ప్రభుత్వాస్పత్రిలో రోగుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఆర్వో రక్షిత తాగునీటి ప్లాంట్‌ను ఎమ్మెల్యే వరప్రసాదరావు ప్రారంభించారు. అలాగే ఆస్పత్రి ఆవరణలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. గ్రామస్థాయిలోనే వైద్యసదుపాయాన్ని అందించేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా గ్రామాల్లోని సచివాలయాలు, ఆవాస ప్రాంతాల్లో వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. ఆస్పత్రి కమిటీ సభ్యులు కుంపట్ల చిన్నారి, ఎంపీటీసీ చెల్లింగి లక్ష్మీఈశ్వరి, సర్పంచ్ రేవు జ్యోతి, జెడ్పీటీసీ మట్టా శైలజ, లీగల్ సెల్ కార్యదర్శి మంగెన సింహాద్రి, బందారు కాశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవకు అద్భుతమైన అవకాశం



రమణికి మొక్క అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

మామిడికుదురు: ప్రజాసేవ చేసేందుకు సివిల్స్ అద్భుతమైన అవకాశమని, సర్వీసులో చేరిన నాటి నుంచి ప్రజాసేవే లక్ష్యంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా సివిల్స్ విజేత రమణికి సూచించారు. సివిల్ సర్వీస్ పరీక్షల్లో ప్రతిభ చూపి 583వ ర్యాంకు సాధించిన ఈదరాడ గ్రామానికి చెందిన యర్రంశెట్టి ఉమాశ్రీలక్ష్మీరమణి మంగళవారం అమలాపురంలోని జిల్లా కలెక్టరేట్‌లో కుటుంబ సభ్యులతో కలసి కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు కలెక్టర్ శుక్లా మొక్కను అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం జేసీ ధ్యానచంద్రను కూడా రమణి కలిశారు. జేసీ కూడా రమణిని సన్మానించి ఆమెకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, రమణి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రెండోరోజు పనిచేయని సర్వర్లు

ఆలమూరు: మండల కేంద్రమైన ఆలమూరులో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రెండో రోజైన మంగళవారం కూడా సర్వర్లు పనిచేయక రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. వరుసగా రెండు రోజులు పాటు రిజిస్ట్రేషన్లకు అంతరాయం ఏర్పడటంతో కక్షిదారులు నిరాశతో వెనుదిరిగారు.

వడగళ్ల వాన

అయినవిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో వడగళ్ల వాన కురిసింది. శానపల్లిలంక, కొండుకుదురు తదితర గ్రామాల్లో మంగళవారం పెద్ద పెద్ద శబ్దాలతో వడగళ్ల వాన కురిసింది. ఆకాశం నుంచి చిన్న చిన్న ఐస్ ముక్కలు భూమి మీద పడటంతో వాటిని చిన్నపెద్ద తారతమ్యం లేకుండా ఏరుకుని సరదాగా సంబరపడ్డారు. కుండపోత వర్షానికి మండలంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానిక మండలం పరిషత్ కార్యాలయం వద్ద రహదారి వర్షపునీటితో ముంపునకు గురయింది. ఇటుక బట్టీ యజమానులు, రైతులు అకాల వర్షంతో ఉరుకులు, పరుగులు పెట్టారు.



కొండుకుదురులో వర్షంతో పడిన వడగళ్లు

నేడు అన్నదాన భవన నిర్మాణానికి భూమిపూజ

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి అన్నప్రసాద ట్రస్ట్ భవన నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చేతుల మీదుగా బుధవారం భూమి పూజ చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే ఎమ్మెల్యే గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. అనంతరం మండలంలోని వలంటీర్లను సత్కరిస్తారన్నారు.

చల్లబడిన వాతావరణం



అంబాజీపేటలో నల్లటి మబ్బులతో ఆకాశం

అంబాజీపేట: సూర్యుడి భగభగలు చూసి ప్రజలు హడలిపోయారు. రోహిణి కార్తెలో చింతనిప్పులను తలపించేలా ఎండలు కాస్తూ ఉక్కబోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ పరిణామాలు చూసి ఉదయం 12 గంటల ప్రాంతంలో ఆకాశం దట్టమైన నల్లటి మేఘాలు కమ్ముకుని వర్షించింది. దీంతో చిన్న, పెద్దా హమ్మయ్య అంటూ ఉపశమనం పొందారు.

ఈదురుగాలులకు కూలిన స్తంభాలు



అప్పనపల్లి బాడవలో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

మామిడికుదురు: బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి మంగళవారం పలు చోట్ల కొబ్బరిచెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండలంలోని గ్రామాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామాల్లో అంధకారం అలుముకొంది. పెదపట్నంలో ఎనిమిది విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. అప్పనపల్లి బాడవలో పలు విద్యుత్ స్తంభాలతో పాటు రెండు సింగిల్ ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పై రెండు గ్రామాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సమయం పడుతుందని సంబంధిత అధికారులు చెప్పారు. నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు సంబంధిత శాఖాధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు.

పాలవెల్లువను విజయవంతం చేయాలి

ఆలమూరు: పాలవెల్లువపై గ్రామాల్లో విరివిగా పాడిరైతులకు అవగాహన కల్పించి అత్యధిక పాల సేకరణ ద్వారా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, తహసీల్దార్ ఐపి శెట్టి తెలిపారు. మండలంలోని జొన్నాడలో సర్పంచ్ కట్టా శ్రీనివాసు అధ్యక్షతన మంగళవారం పాలవెల్లువపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి యానిమేటర్లు, పశుసంవర్ధకశాఖ, గ్రామ సచివాలయ అధికారులు సిబ్బంది హాజరయ్యారు. గ్రామ సచివాలయ సిబ్బంది, అధికారులు, గ్రామ వలంటీర్లు గ్రామాల్లో పర్యటించి పాడి రైతులను గుర్తించాలన్నారు. వారందరికీ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించి తద్వారా పాలను సేకరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉప సర్పంచ్ నాంద్ర నాగమోహన్ రెడ్డి, కార్యదర్శి చిక్కాల వీరమాత, ఏపీఎం ఎం.విశ్వనాథ్, ఏపీఓ కామత్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణాన్ని నిరసిస్తూ ఆందోళన

మామిడికుదురు: మొగలికుదురులోని షిర్డీ సాయి బాబా ఆలయం ఎదురుగా కడలి పంట కాలువపై చేపట్టిన వంతెన నిర్మాణాన్ని నిరసిస్తూ స్థానికులు మంగళవారం నిరసన తెలిపారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో అయిదు వంతెనలు ఉన్నాయని, వంతెనల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వంతెన నిర్మాణాన్ని తక్షణం నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో చేనేత సొసైటీ అధ్యక్షుడు బళ్ల సత్యనారాయణ, చింతా చిన్న, యాండ్ర పుల్లయ్య, కందనాల నాగరాజు, సూరవరపు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి గీసిన పచ్చని చిత్రం..



దిండిలో ఆకర్షిస్తున్న పచ్చని చిత్రం

మలికిపురం: మేడంటే మేడా కాదూ... గూడంటే గూడూ కాదూ... పదిలంగా అల్లుకున్న పొదరిల్లూ మాదీ... పొదరిల్లూ మాదీ... అంటూ సాగిన అలనాటి యుగళ గీతం గుర్తుకువస్తుంది... ఈ ఫొటో చూస్తుంటే... బయట ఎండలు ప్రచండ రూపం దాలుస్తుండగా పర్యాటక కేంద్రం దిండిలో ప్రకృతి గీసిన ఈ చల్లటి పచ్చని చిత్రం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఓ వైపు ఎండలు మండుతున్న వేళ ఈ పచ్చటి విడిదిలో ప్రకృతి ప్రేమికులు హాయిగా సేద తీరుతున్నారు.